హైదరాబాద్ వార్త



ఉప్పల్ ప్రధాన రహదారిలోని సిఎంఆర్ షాపింగ్‌మాల్‌లో అగ్ని ప్రమాదం జరిగిన దృశ్యం

## సిఎంఆర్ షాపింగ్‌మాల్‌లో అగ్ని ప్రమాదం

**షార్ట్‌సర్క్యూట్ కారణమేనా.. ప్రమాదంపై అనుమానాలు**

ఉప్పల్, జనవరి 3 ప్రభాతవార్త : ఉప్పల్ ప్రధాన రహదారిలో మూడు నెలల క్రితం ప్రారంభం అయిన ఒక షాపింగ్‌మాల్‌లో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించి స్వల్ప అస్తి నష్టం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ ప్రధాన రహదారిలో కొత్తగా నిర్మించిన భవనంలో మూడు నెలల క్రితం ప్రముఖ నటి చేతుల మీదుగా సిఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభించారు. అయితే అప్పటి నుంచి ఈ షాపింగ్‌మాల్‌లో వ్యాపారం చేస్తున్నారు. మంగళవారం రాత్రి పది గంటల తర్వాత షాపింగ్‌మాల్ మూసివేసిన తర్వాత పదిన్నర గంటలోనే షాపింగ్ మాల్ ముందు భాగంలో మంటలు అంటుకున్నాయి. ఒక్కసారిగా ముందు వైపు ఉన్న ప్లెక్సీలు, ఇతర భాగాలకు మంటలు అంటుకుని భారీ ఎత్తున మంటలు ఎగిసి పడ్డాయి. దీంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వివిధ ప్రాంతాల నుంచి ఐదు ఫైరింజన్లు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అర్పివేశారు. సంఘటనా స్థలాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేరుకుని ప్రమాదం వివరాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు. షాపింగ్‌మాల్స్‌లో అగ్ని ప్రమాదాలు నివారణకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. సంఘటనా స్థలాన్ని డిసిపి దరావత్ జానకి, ఎసిపి చంద్రశేఖర్, సిఐ శ్రవణ్‌కుమార్ తదితరులు సందర్శించి వివరాలు సేకరించారు. ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సావిత్రీబాయి అడుగు జాడలు అందరికీ ఆదర్శం : మంత్రి సీతక్క



హైదరాబాద్, జనవరి 3,ప్రభాతవార్త: సావిత్రీబాయి పూలే నాడు వేసిన విద్యాపునాదులే నేడు మనకు ఆదర్శ అడుగు జాడలని మంత్రి సీతక్క అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఆదర్శ మహిళా ఉపాధ్యాయులకు, తెలంగాణ ఉద్యమకారులకు, మహిళా పాత్రికేయులకు ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆమె ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈసందర్భంగా సీతక్కమాట్లాడుతూ సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న మహిళలు ఇంకెన్నో విజయాలు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళల్లో పోరాడే శక్తితోపాటు సమస్యలను ఎదుర్కొనే శక్తి పెరడటం ఆహ్వానించదగ్గ పరిణామం అని పేర్కొన్నారు. బిసి కమిషన్ మాజీ చైర్మన్ బిఎస్ రాములు మాట్లాడుతూ సావిత్రీ బాయి పూలే భారతీయ తొలి ఉపాధ్యాయురాలని 193 ఏళ్ల తర్వాత కూడా ఆమె జయంతిని ఇంత గొప్పగా జరపుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు.

## జూబ్లీహిల్స్ కి"లేడీ" అరెస్ట్

**లిఫ్ట్ అడిగి.. బట్టలు చించుకుని కేకలేస్తూ బ్లాక్‌మెయిలింగ్**

హైదరాబాద్, జనవరి 3,ప్రభాతవార్త: నడిరోడ్డుపై నిల్చుని కారులో వెళ్లేవాళ్లను లిఫ్ట్ అడుగుతుంది. జాలిపడి లిఫ్ట్ ఇచ్చారో ఇక అంతే ..రేప్ చేయబోయారని బెదిరించి మరీ డబ్బులు వసూలు చేస్తుంటుంది. అలా పదుల సంఖ్యలో బెదిరింపు ఉదంతాలకు పాల్పడిన కిలా(లే)డీని ఎట్టకేలకు జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సయిదా నయిమా సుల్తానా అనే మహిళ ..రోడ్డుమీద వెళ్లేవారిని లిఫ్ట్‌అడిగి ..వాహనంలో ఎక్కి కొద్దిదూరం వెళ్ళిన తర్వాత తనను రేప్ చేసేందుకు ప్రయత్నించావని ..పోలీస్ స్టేషన్‌లో కేసు పెడతానని ..బెదిరించి డబ్బులు వసూలు చేస్తుంది. తాజాగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి కెబిఆర్ పార్క్‌దాకా లిఫ్ట్ కావాలి అంటూ కారులోఎక్కిన నిందితురాలు ..బట్టలు చించుకుని రేప్‌కేసు పెడతానని కారు డ్రైవర్‌ను బెదిరించింది. దీంతో బాధితుడు పోలీసులకు పిర్యాదు చేయగా అమాయకులను టార్గెట్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్న కిలేడీని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు.



# అమ్మాయిలా చాటింగ్.. ఆపై బ్లాక్‌మెయిల్



- ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ నకిలీ ఖాతాలు
- ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపి..అశ్లీల చాటింగ్‌లు
- ఆపై బ్లాక్‌మెయిల్ చేస్తూ హింసిస్తున్న వైనం
- తాజాగా ఓయువకుడ్ని అరెస్ట్ చేసిన సైబర్‌క్రైం పోలీసులు
- సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలి



హైదరాబాద్, జనవరి 3,పభాతవార్త: ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగ్రామ్‌లో అందమైన అమ్మాయిఫోటోతో నకిలీ ఖాతాలు చేరిచి రిక్వెస్ట్‌లు పంపిస్తారు. అమ్మాయి లాగే వారితో చాటింగ్ చేస్తారు. కొన్ని రోజులతర్వాత సెక్స్ చాటింగ్ చేసి.. ఇంటర్ నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న అందమైన యువతుల అర్థనగ్న ఫోటోలు ఎదుటివారికి పంపించి ..మీఫోటోలు కూడా పంపించాలని కోరతారు. కొందరు ఆఫోటోలు పంపగానే వాటిని సెల్‌ఫోన్ లో సేవ్ చేసుకుని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారు. ఇలాంటి నేరాలకు పాల్పడుతున్న కేటుగాళ్లు అమ్మాయిలను లైంగికంగా వేధిస్తుండగా.. అమ్మాయిలు అబ్బాయిలను డబ్బుఇవ్వాలని బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. తాజాగా ఇన్‌స్ట్రాగ్రాం మాద్యమం ద్వారా యువతిల్ని వేదిసునతన్న వ్యక్తిని హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జిష్ణుకీర్తన్ అనే వ్యక్తి అమ్మాయి పేరుతో ఇన్‌స్ట్రాగ్రామ్‌లో రెవ్వెస్ట్‌లు పంపుతున్నాడు. అమ్మాయే అనుకుని నమ్మి పరిచయం పెరిగాక ..కొంతమంది అమ్మాయిలు తమ వ్యక్తిగత పోటోలు అతడికి పంపించారు. దీనికి అసరగా తీసుకుని వాటిని సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరిస్తుండటంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు పోకిరీ ఆటకట్టించి కటకటాల వెనక్కి పంపారు. ముఖ్యంగా ఈమెయిల్, ఫేస్‌బుక్, వాట్సాప్‌లతో మహిళలను బెదిరిస్తున్న కేసులు కామన్ అయ్యింది. ఇప్పటివరకు వేధింపులకు గురవుతున్న బాధితుల్లో ఎక్కువశాతం సాప్ట్‌వేర్ ఎంప్లాయిస్, కాలేజీ విద్యార్థులే ఉన్నారు. అయితే మగవారితో ఉన్న చిన్న చిన్న పరిచయాలతోనే వేధింపులకు గురవుతున్నారని పోలీసుల దర్యాప్తులో తేలుతుంది. మారిన సామాజిక పరిస్థితులు, స్థితిగతుల మూలంగా ఎక్కువగా అత్యాచారానికి గురయ్యే విధంగా పురిగొల్పుతున్నాయి. ఇలాంటి వేధింపులు భరించలేక కొంత మంది ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి.

**అబ్బాయిలూ మోసపోతున్నారు..** వాట్సాప్ వీడియో కాల్ చేసి నగ్నచిత్రాలు పంపించి.. నీ నగ్నచిత్రాలు పంపమని ఆపైబ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు స్వాహా చసిన ఘటనలు ఇటీవల మైలార్ దేవులపల్లిలో చోటుచేసుకున్నాయి. లక్ష్మగూడలో ఉండే ఇంటర్ విద్యార్థి సెల్‌ఫోన్‌కు ఓయువతి (యువకుడే )నుంచి కాల్ వచ్చింది. నీఅందం చూసి పడిపోయానంటూ మూడు గంటలపాటు చాట్‌చేశాడు. మరుసటి రోజు వీడియోకాల్ వచ్చింది. ఓయువతి తన తల కనిపించకుండా నగ్నంగా కనిపించిందవి. నువ్వంటే నాకు పిచ్చిప్రేమ ..అందుకే ఇలా కనిపిస్తున్నానంటూ ఏమార్చాడు. ఆపై నాక్ నీనగ్న చిత్రం లేదా వీడియో పంపించాలని కోరింది. ఆమాటలకు మోసపోయిన విద్యార్థి నగ్నంగా తాయరై వీడియోకాల్‌లో కనిపించాడు. ఆపై ఓవ్యక్తి వీడియో కాల్‌లో ప్రత్యక్షమై బ్లాక్‌మెయిల్ చేశాడు. మాఇంటి ఆడపిల్లకు నగ్నంగా ఉన్న ఫోటోలు, వీడియోలు పంపిస్తావా.. మీఇంటికి వచ్చి మీ వాళ్లను నిలదీస్తానని హెచ్చరించాడు. వద్దని వేడుకున్న యువకుడు ఏంకావాలంటే అంది ఇస్తానన్నాడు. దీంతో యువకుడి వద్దనుంచి రూ.30వేలు రాబట్టుకున్నాడు. పెద్దవాళ్లకు తెలిసి మైలార్‌దేవులపల్లి పిఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఇదేతీరులో శాస్త్రీపురానికి చెందిన మరో యువకుడు కూడా మోసపోయాడు.

**సామాజిక మాధ్యమాలతో జాగ్రత్త..** ఫేస్‌బుక్,వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమాల ప్రభావ విస్మృతి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కల్లదు. పెద్దలే కాదు పాఠశాల స్థాయి పిల్లలూ వీటిని వినియోగిస్తున్నారు. సమాచార మార్పిడిలో విప్లమాత్మక మార్పులు తెచ్చిన మాట వాస్తవమే అయినా..పరువు తీసే విషయంలో ఈమాధ్యమాలు ముందుంటున్నాయి. ముఖ్యంగా అమ్మాయిలు వీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. భర్తతోనో,ప్రియుడితోనో సన్నిహితంగా ఉన్నప్పుడు పొరపాటున చిత్రాలు, వీడియోలు తీసుకుంటే భవిష్యత్తులో ఆదృశ్యాలే పరువు తీసే కాలనాగులై కాటేస్తుంటాయి. సంబంధాలు బాగున్నప్పుడు పర్వాలేకున్నా..ఒక వేళ చెడిపోతే ఆదృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో ప్రసారమై పరువు బజారుకీడుస్తున్నాయి. మరోవైపు సామాజిక మాధ్యమాల్లో అందమైన అమ్మాయిలు కనబడితే చాలు నగ్నచిత్రాలు మార్ఫింగ్ చేసి బెదిరించే కేటుగాళ్ల ఈమధ్యకాలంలో పెరిగిపోయారు. దీనికితోడు వాట్సప్‌లకు అసభ్య సందేశాలు పంపిస్తూ వేధింపులకు గురిచేసే కేటుగాళ్లకూ కొదవలేదు. ఈనేపథ్యంలో సామాజిక మాధ్యమాల వినియోగంలో అమ్మాయిలు జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఏర్పడింది.



శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

## కేంద్రమంత్రి పూజలు

యూసుఫ్‌గూడ, జనవరి 3, ప్రభాతవార్త : యూసఫ్ గూడ డివిజన్ వెంకటగిరి బస్తీలో అతి పురాతనమైన శ్రీ వీరాంజేయ స్వామి దేవాలయం పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి పాల్గొని, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం కమిటీ సభ్యులు కిషన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు చింతల రాంచంద్రారెడ్డి, బిజెపి హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతమ్‌రావు, కె.రాములు, బాలయ్య యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు సుదర్శన్‌రావు, నర్సింగ్‌రావు, శ్రీశైలం యాదవ్, పులిరామ్, రామాంజనేయులు, బాలరాజ్, బడుగు సతీష్, వేణు, నారాయణ పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్‌లో వరద నీటి కాలువ నిర్మాణపు పనులకు బ్రేక్

సరూర్‌నగర్, జనవరి 3 ప్రభాతవార్త: హైదరాబాద్ నగర శివార్లలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బడంగ్‌పేట్‌లో వరద నీటి కాలువ పనులను స్థానికులు అడ్డుకున్నారు. 22వ డివిజన్ కిందకు వచ్చే స్థానిక సాయిప్రభ కాలనీలోని 15 ఫీట్ల ఇరుకు రోడ్డులో ఏకంగా ఇళ్ళ ముందు నుండి జరుగుతున్న తవ్వకాలను అడ్డుకోవడానికి స్థానిక కాలనీ మహిళలు జెసిబి ముందు బైఠాయించి ఆందోళన చేశారు. సంబంధిత కాంట్రాక్టర్ నచ్చజెప్పినా.. పోలీసులు రంగంలోకి దిగినా స్థానికులు వెనక్కి తగ్గలేదు. దీంతో వరద నీటి కాలువ పనులు నిలిచిపోయాయి. అసలే 15 ఫీట్లుగా ఉన్న తమ కాలనీ రహదారిలో తమకు ఏ మాత్రం ఉపయోగం లేని కాలువ నిర్మాణం కోసం తవ్వడం వల్ల తమ ఇళ్ళకు ఉన్న మంచి నీటి పైప్‌లైన్లు, డ్రైనేజీలు ధ్వంసం అయ్యాయనీ దీంతో తాము తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడ్డామని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. గత వారం రోజుల నుండి తాము తీవ్ర అవస్థలకు గురవుతున్నామని వారు అసహనం వ్యక్తం చేశారు.

## మంత్రి సీతక్కను కలిసిన గౌడ కల్లుగీత సంఘా సమన్వయ కమిటీ



సీతక్కను సన్మానిస్తున్న బాలరాజుగౌడ్, వెంకన్నగౌడ్, విజయ కుమార్‌గౌడ్ తదితరులు

హైదరాబాద్, జనవరి 3,ప్రభాతవార్త: సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకుని తెలంగాణ గౌడకల్లుగీత సంఘా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర పంచాయితీశాఖ మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. సీతక్క మొదటిసారిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజుగౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైరనమన్ ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్‌లు శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## వైద్య కళాశాలకు పార్థీవ దేహం దానం



పార్వతమ్మ

నిజాంపేట్, జనవరి 3, ప్రభాత వార్త : గోగినేని పార్వతమ్మ (73) బాచుపల్లి వాస్తవ్యులు బుధవారం ఆమె మరణానంతరం వారి కోరిక మేరకు వారి పిల్లలు దాసరి రజని, కాకర్ల జ్యోతిలు మమతా అకాడమి ఆఫ్ మెడికల్ సైన్స్‌కి ఆమె పార్థివ దేహాన్ని దానం చేశారు. వారి ఔనత్యాన్ని మమతా అకాడమి ఆఫ్ మెడికల్ సైన్స్ డైరెక్టర్ డా. నయన్‌రాజ్, డీన్ డా.హరికృష్ణ, అనాటమి హెడ్ డా. మురళీకృష్ణలు కొనియాడారు.

## బాలిక వెంట పడుతూ వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు

బేగంపేట జనవరి 3,ప్రభాతవార్త: బాలిక వెంట పడుతూ వేధిస్తున్న యువకుడిపైన బేగంపేట పోలీసులు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసారు.బేగంపేట సబ్‌ఇన్స్‌పెక్టర్ వరలక్ష్మి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.బేగంపేట రసూల్‌పురాలోని బాలిక (16) సికింద్రాబాద్ లోని ఓ బట్టల స్టోర్‌లో పనిచేస్తుంది.ప్రతి రోజు పనికి వెళ్లి వస్తున్న సమయంలో శ్రీలంక బస్తీలో నివసించే కరీం (22) వెంట పడుతూ వేధిస్తుండేవాడు. మంగళవారం కూడా బాలిక పనికి వెళుతున్న క్రమంలో ప్యారడైజ్ మెట్రో స్టేషన్ వద్ద వేచి ఉన్న నిందితుడు ఆమెను అడ్డుకోవడంతో పాటు దుర్భాషలాడుతూ తనతో మాట్లాడాలని బెదిరించాడు.గతంలో కూడా కరీం వేధింపులకు పాల్పడటంతో బాధితురాలు జరిగిన విషయాన్ని తల్లి దండ్రులకు చెప్పింది.వారు వెళ్లి యువకుడి తల్లి దండ్రులకు జరిగిన విషయం చెప్పారు.అయినా కరీం తన పద్దతి మార్చుకోకపోవడంతో బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసారు.దీంతో పోలీసులు నిందితుడిపై ఫోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వైన్‌షాప్‌లా.. ఓపెన్ బార్లా?

**పేరుకే పర్మిట్ రూమ్‌లు.. అంతా రోడ్డుపైనే ● మామూళ్ళ మత్తులో ఎక్సైజ్ అధికారులు**



దారువాలా వైన్‌షాపు పక్కనే మద్యం సేవిస్తున్న మందుబాబులు

వివేకానందనగర్‌కాలనీ, జనవరి 3 ప్రభాతవార్త: మద్యం షాపులకు పర్మిట్ రూమ్‌లను అనుమతించినా, వైన్‌షాపు యజమానుల ఇష్టారాజ్యంతో వైన్‌షాపుల సమీపంలోని ఖాళీ స్థలాలు, రోడ్లపక్కనే మందుబాబులు మద్యం సేవిస్తున్నారు. కొందరు ఎక్సైజ్ పోలీస్ అధికారుల అవినీతి, పర్యవేక్షణలోపం కారణంగా యజమానులు ఓపెన్‌బార్‌లుగా మారుస్తున్నారు. దీంతో వైన్‌షాపుల సమీపం నుంచి వెళ్లాలంటేనే ప్రజలు ముఖ్యంగా మహిళలు జంకే పరిస్థితి నెలకొంది. కూకట్‌పల్లి వివేకానందనగర్ డివిజన్‌లోని బాలక్రిష్ణనగర్ సర్కిల్‌లో ఉన్నటువంటి దారువాల వైన్‌షాపు పక్కనే గల రోడ్లపై మందుబాబులు మద్యం సేవిస్తూ అనేక సమస్యలకు కారణమవుతున్నారు. రాత్రుల్లో రోడ్డుమీదనే బీర్లు పొంగుతున్నాయి. మందుబాబులు వీరంగం సృష్టించి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అనేక ప్రాంతాల్లో వైన్‌షాపుల నిర్వాహకులు తమ స్వార్థప్రయోజ నాలకే పరిమితమై అక్రమ మార్గంలో తమ వ్యాపారాన్ని పెంచుకుని కోట్లకు పడగలెత్తుతూ సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురిచేచేస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు ఎంతసేపు ఎన్ని పెట్టెలు మద్యం సరఫరా చేశామంటూ మద్యం విక్రయాలపైనే దృష్టిపెడుతున్నారు. తప్పితే వైన్‌షాపుల వద్ద ఏం జరుగుతోందనే విషయాన్ని పట్టించుకున్నా దాఖలాలు లేవు. దీంతో వైన్‌షాపుల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో వైన్‌షాపుల ముందు మందుబాబులు మద్యం సేవిస్తున్నారు. పగలు రాత్రి అనే తేడా లేకుండా ఎప్పుడు చూసినా మద్యం షాపుల ముందు మందుబాబులు వీరంగం నిత్యం కృత్యంగా మారింది. బహిరంగ ప్రదేశాలు, రోడ్ల పక్కన మద్యం సేవించరాదనే నిబంధనలు ఉన్నాయి. అయినా ఒకవైపు వైన్‌షాపుల యాజమాన్యాలు, మరో పక్క మందుబాబులు ఇంత బరితెగిస్తున్నా ఆయా పోలీస్‌సేషన్ల పరిధిలోని పోలీసు యంత్రాంగంకాని ఇటు ఎక్సైజ్ సిబ్బంది మద్యం షాపులవైపు కన్నెత్తి చూడడంలేదు. అధికారులకు రావాల్సిన మామూళ్ళు అందుతుండడంతో నిబంధనలను పాతరవేస్తున్న వైన్‌షాపులపై చర్యలు తీసుకోవడంలేదు.

**దారువాలా వైన్‌షాపు వద్ద అక్రమ పార్కింగ్..** కూకట్‌పల్లి బాలక్రిష్ణనగర్ సర్కిల్ వద్ద గల దారువాలా వైన్‌షాపు ముందు రోడ్డుమీదనే వాహనాల అక్రమ పార్కింగ్‌తోపాటు పక్కనే మద్యం బాబులు చేసే హంగామాతో ముఖ్యంగా మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సాయంత్రం అయిందంటే మద్యం బాబుల వాహనాల అక్రమ పార్కింగ్‌తో రాకపోకలు తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. కూకట్‌పల్లి ముంబాయి జాతీయ రహదారివైపు వెళ్ళే వాహనాదారులతో ఈ రహదారిపై వాహనాలు పెద్దఎత్తునరాకపోకలు సాగిస్తుంటాయి. అక్రమ పార్కింగ్ వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడంలేదు. అంతేకాకుండా పీకల దాక తాగిన మద్యం బాబులు రోడ్డుమీదనే పడుకొని వాహనదారులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారు.



సిఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ కె.లక్ష్మయ్య తదితరులు

## ప్రజాపాలన స్పందన చూసి బీఆర్ఎస్ నేతలకు నిద్రపట్టడం లేదు

**రవాణాశాఖామంత్రి పొన్నం ప్రభాకర్**



ప్రజాపాలన కేంద్రంలో దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ముషీరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో చేపట్టిన అభయహస్తం కార్యక్రమానికి ప్రజల నుండి వస్తున్న స్పందన చూసి బీఆర్ఎస్ నేతలకు నిద్రపట్టడం లేదని తెలంగాన రవాణాశాఖామంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని భోలక్‌పూర్‌లోని ప్రజాపాలన కేంద్రంను ఆయన స్థానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్, జీహెచ్ఎంసీ కమీషనర్ రోనాల్డ్‌రోస్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలతో కలసి సందర్శించి, అక్కడ దరఖాస్తుదారులతో మాట్లాడారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ నెల రోజులు కూడా నిండని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి వాటిని అమలుచేస్తూ ఉంటే చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేయటం సిగ్గుచేటని మండిపడ్డారు. రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించటం బీఆర్ఎస్ నేతలకు ఇష్టం లేక, ఆటో డ్రైవర్లకు మద్దతు ఇస్తున్నారని విమర్శించారు. ఆటో డ్రైవర్లు తమ సమస్య ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే తప్పకుండా వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అధికార పగ్గాలు చేపట్టిన నెల రోజుల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి రెండు హామీలను నెరవేర్చారని, మిగతా హామీలను ప్రభుత్వం తప్పకుండా త్వరలోనే నెరవేరుస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ కార్పోరేటర్‌లు వాజీద్‌హుస్సేన్, ఆర్.కల్పనాయాదవ్, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అరవింద్‌కుమార్‌యాదవ్, సంగపాక వెంకట్, మేడి సురేష్, పెండం శ్రీనివాస్‌యాదవ్, పట్నం నాగభూషణం గౌడ్, జీహెచ్ఎంసీ జోనల్ కమీషనర్ రవికిరణ్, డీఎంసీ తిప్పర్తి యాదయ్య, నియోజకవర్గ ప్రజాపాలన ప్రోగ్రాం ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## స్త్రీలు సావిత్రిబాయి పూలే వారసులుగా జీవించాలి

**ఐపిఎస్ అధికారిని చేతన**





సభలో ప్రసంగిస్తున్న చేతన

సైఫాబాద్, జనవరి 3 ప్రభాతవార్త: దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో బుధవారం స్రామాట్ కాంప్లేక్స్ సావిత్రిబాయి పూలే 193వ జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐపిఎస్ అధికారిని చేతన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే వారసులుగా ఆమెలో ఉన్న ఒక్క రక్తపు చుక్క మనలో ఉన్న మనం ఆమె బాటలో నడవాలని సూచించారు. అట్టడుగు స్థాయిలో ఉన్న ప్రజలకు విద్య చాలా ముఖ్యమని భావించిన పూలే విద్యను అందించడంలో ఎంతో కృషి చేశారని కొనియాడారు. కుల నిర్మూలన జరగాలంటే ఇప్పుడున్న విద్య ద్వారా సాధ్యం కాదన్నారు. విద్యా వ్యవస్థగా రాజకీయ వ్యవస్థ సమూలంగా ప్రక్షాళన కావాలన్నారు. దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే త్యాగాల ఫలితంగానే నేడు కనీసం మహిళలు ఈ స్థాయిలో ఉన్నారని, పేద వర్గాల స్త్రీలకు విద్యను అందించేందుకు అందరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ జయంతి కార్యక్రమంలో ప్రముఖ శాస్త్రవేత్త చారులత, సజయ, సిద్దోజీ, జి.శంకర్, గిరిజ, వనజాక్షి ప్రసంగించారు.

**మహిళా విశ్వవిద్యాలయంకు సావిత్రిబాయిపూలే పేరు పెట్టాలి**

తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంకు సావిత్రిబాయి పూలే మహిళా విశ్వవిద్యాలయంగా పేరు పెట్టాలని ప్రముఖ సామాజిక వేత్త ప్రొఫెసర్ కంచె ఐలయ్య డిమాండ్ చేశారు. ఈ విషయంలో విద్యార్థులు సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని కోరారు. బుధవారం నిజాం కళాశాలో జరిగిన సావిత్రిబాయి పూలే 193వ జయంతి కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అజ్ఞాన అంధకారాలను, అణిచివేతలను ఎదుర్కొని అట్టడుగు వర్గాలకు విద్యను అందించడమే కాకుండా సమాజానికి ఎంతో సేవ చేసిన గొప్ప వ్యక్తి సావిత్రిబాయి అని కొనియాడారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.భీమా మాట్లాడుతూ సావిత్రిబాయిని అదర్శంగా తీసుకుని విద్యార్థులు శ్రమించాలని, సమయాన్ని వృదా చేయకుండా విజ్ఞానాన్ని సంపాదించుకుంటు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు వారు, కళాశాల వైస్-ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి, సి.హెచ్.వెంకటేశ్వర్లు, మోహన్‌రెడ్డి, పరందాములు, మంజుల, బిసి సేల్ విద్యార్థి నాయకుడు కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్య అక్షింతల కలశాల యాత్ర



బేగంపేట జనవరి3,ప్రభాతవార్త : అయోధ్యలో ఈ నెల 22న శ్రీరామ విగ్రహ ప్రతిష్టాపన రోజున ప్రతి ఒక్క ఇంటికి అందజేసిన అక్షితలను తలపై ధరించాలని బీజేపీ సీనియర్ నాయకులు నెమలి ఆనంద్ అన్నారు.అయోధ్య నుంచి వచ్చిన అక్షితల కలశాల ఊరేగింపు బుధవారం బేగంపేట డివిజన్ లోని శ్యాంలాల్ బిల్డింగ్ శ్రీవిజయగణపతి ఆలయం నుంచి ప్రారంభించారు.ఈ సందర్భంగా అక్షితల కలశాలను తలపై ధరించి వీరాంజనేయ దేవాలయం, తాతాచారి కాలనీ,సాయిబాబా గుడి,ముత్యాలమ్మ మందిరం, షాపర్స్ స్టాప్ వీధిలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం వరకు కలశాల ఊరేగింపు కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు.ఈ ఊరేగింపులో నెమలి ఆనంద్ (నందూ)తో పాటు అమరం శ్రీనివాసరెడ్డి,యామగోని గంగాధర్‌గౌడ్,మైసూర్ మధు, సి.విజయకుమార్,రాకేష్ పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : కొంతం దీపిక



మారేడ్‌పల్లి ప్లే గ్రౌండ్‌లో వికసిత్ భారత్ శిబిరంలో ప్రసంగిస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు

అడ్డగుట్ట, జనవరి 3 ప్రభాతవార్త: పేద ప్రజల సంక్షేమం కోసం ప్రధాన మంత్రి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక తెలిపారు. బుధవారం మారేడ్‌పల్లిలోని షెనాయ్ మున్సిపల్ ప్లే గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యం కోసం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్, నిక్షయ పోచన యువజన, అగ్రి బిజినెస్, ఉజ్వల యోజన పథకం గ్యాస్, టీబీ,అవాస్ యోజన వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆరోగ్యశాఖ ఎస్.పి. హెచ్.ఓ. డాక్టర్ జయశ్రీ, అడ్డగుట్ట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి శంకర్, బిజెపి నాయకులు వీరవర్ధన్ గౌడ్, చిన్న వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

**మారుతీ వీధిలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కొంతం దీపిక..** మోండా డివిజన్‌లోని మారుతీ వీధిలో అస్తవ్యస్థంగా ఉన్న డ్రైనేజీ సమ స్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ కొంతం దీపిక జలమండలి అధికారులకు ఆదేశించారు. బుధవారం ఏఈ సంధ్య, సిబ్బంది నవీన్, లక్ష్మణ్‌లతో కలిసి పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

## ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ



అయ్యప్పస్వామి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త: ముషీరాబాద్ నియోజక వర్గంలోని భోలక్‌పూర్ డివిజన్ రంగానగర్‌లో అయ్యప్పస్వామి మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. బుధవారం భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు వై.శ్రీనివాస్, హర్షవర్ధన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 28వ మహాపడిపూజలో స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకట నారాయణ గురుస్వామిచే అయ్యప్ప భక్తి గీతాల భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వినయ్‌స్వామిచే నిర్వహించిన ఈ మహాపడిపూజా కార్యక్రమంలో కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, బీఆర్ఎస్ నేతలు డి.శివముదిరాజ్, దీన్‌దయాళ్‌రెడ్డి, ఉమాకాంత్, శంకర్‌గౌడ్, వెంకటేష్, మల్లేష్, యాదయ్య, పోచయ్య పాల్గొన్నారు.

### బిసి సేన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



హైదరాబాద్, జనవరి 3,ప్రభాతవార్త: బిసి సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కార్యలెండర్ 2024ను బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్.కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈమేరకు బుధవారం విద్యానగర్‌లో లో జరిగిన సావిత్రీబాయి పూలే జయంతి వేడుకల్లో పాల్గొని క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ అణగారిన వర్గాల జీవితాల్లో అక్షర జ్యోతి వెలిగించిన సామాజిక విప్లవకారిణి సావిత్రీ బాయి పూలే అన్నారు. నిరంతరం వెనకబడ్డ ప్రజల జీవితాల్లో మార్పుల కోసం, మానవహక్కుల కోసం నిరంతరం పోరాడిన ధీరవనిత అన్నారు. ఈకార్యక్రమంలో గుజ్జకృష్ణ, నీల వెంకటేష్, వెంకటేష్‌యాదవ్, అంనతయ్య, నిరంజన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సావిత్రీబాయిపూలే వర్ధంతి సందర్భంగా శ్రద్ధాంజలి ఘటించిన గోపాల్‌జీ, రౌఫుద్దీన్, మైనార్టీ మోర్చా ట్రెజరర్ షేక్ రెహమతుల్లా

### అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలు

## సద్వినియోగం చేసుకోవాలి : లాస్య నందిత



5వ వార్డు వాల్మీకి నగర్‌లో ప్రజా పాలన కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే లాస్య నందిత తదితరులు

కంటోన్మెంట్,జనవరి 3 ప్రభాతవార్త: పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అ బ [illegible] హస్తం పథకాలను తక్షణమే అమలు చేయాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత తెలిపారు. బుధవారం 5వ వార్డులోని వాల్మీకి నగర్, మారేడ్‌పల్లి నెహ్రూ పార్కు లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రాలను సందర్శించారు. పథకాల కోసం దరఖాస్తు చేసుకునే వారికి సిబ్బంది సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తేలుకుంట సతీష్ గుప్త, పెంట శ్రీహరి, తేలుకుంట అరుణ్ జ్యోతి, పనస సంతోష్, వాజిద్, నెహ్రూ పార్కు డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు హన్మంత్ రావ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**సిఈఓ మధుకర్ నాయక్‌ను కలిసి ఎమ్మెల్యే లాస్య..** కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే లాస్య నందిత బుధవారం బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి.బి.దేవేందర్, లాస్య నందిత, పనస సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### అందరం ఒక్కటిగా ఉండి సంఘాన్ని బలోపేతం చేసుకుందాం

బేగంపేట జనవరి 3,ప్రభాతవార్త : ప్రతి ఒక్కరం సమిష్టిగా ఉండి సంఘాన్ని బలోపేతం చేసుకుందామని డిసీడబ్ల్యూ ఈ అండ్ ఎం జె. రాములు పిలుపు నిచ్చారు.బుధవారం సికింద్రాబాద్ సీడబ్ల్యూఈ ఆఫీసు ఆవరణలో ఎస్సీ,ఎస్టీ సెల్, ఎంపీఎస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు మరియూ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో రాములు ముఖ్య అతిధిగా పాల్గొని సంఘాన్ని మరింత పటిష్టం చేసేందుకు చేపట్టాల్సిన చర్య లపై సభ్యులతో చర్చించారు.ఈ కార్యక్రమంలో నేషనల్ ప్రెశిడెంట్ నర్సింగరావు, ఎస్సీ. ఎస్టీ యూనియన్ అధ్యక్షులు యాదగిరి,జనరల్ సెక్రటరీ ఉమా మహేష్, కోశాధికారి విజయ్‌కుమార్, చలమయ్య, తిరుమలరావు, హరికృష్ణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## ప్రజలకు కాంగ్రెస్ పార్టీపై పూర్తి విశ్వాసం కలిగే విధంగా కార్యకర్తలు పనిచేయాలి

**కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే బండి రమేష్**

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 3, ప్రభాతవార్త: ప్రజాపాలన కార్యక్రమంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుల్లా పనిచేసి ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేవిధంగా చూడాలని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే బండి రమేష్ సూచించారు. బుధవారం బాలానగర్ ఫతేనగర్‌లో ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఫతేనగర్‌లో స్థానిక నాయకులు సమస్యలపై వివరించారు. ఇంజనీరింగ్ అధికారి వ్యవహారి శైలి బాగోలేదని ఇంచార్జీ బండి రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఏఈ పవన్‌కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలు తీర్చడానికి పార్టీలకు అతీతంగా అధికారులు పనిచేయాలి తప్పా ఇష్టారాజ్యంగా వ్యవహరించడానికి కాదని దుయ్యబట్టారు. ఫతేనగర్‌లో దరఖాస్తులు ఇప్పటివరకు ప్రజల నుంచి ఎన్ని వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కుక్కల రమేష్, పుష్పారెడ్డి, సతీష్‌రెడ్డి, కొప్పిశెట్టి దినేష్ కుమార్, గూడెపు నాగరాజు, బాకీ, సునీల్ యాదవ్, నలిని కాంత్, రాజేష్‌గౌడ్, మధు, అనిల్, అమీద్, మహేందర్, సలీం, రాజు పటేల్ పాల్గొన్నారు.

## అర్హులందరికి ప్రభుత్వ పతకాలు అందేలా చూస్తాం

బండ్లగూడ మేయర్ మహేందర్‌గౌడ్




బండ్లగూడ కార్పోరేషన్‌లోని 18.వ,వార్డులో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ మహేందర్‌గౌడ్

నార్సింగి, జనవరి 3 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని అర్హులందరికి రాష్ట్ర ప్రభుత్వ పతకాలు అందేలా చూస్తామని మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం కార్పోరేషన్ పరిధిలోని 18.వ,వార్డులో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో కమీషనర్ శరత్‌చంద్ర, కార్పొరేటర్ గోకరి శ్రీలత సురేష్‌గౌడ్‌లతో కలిసి మేయర్ పాల్గొన్నారు. ప్రజలిచ్చిన దరఖాస్తులను స్వీకరించి అధికారులకు ఇచ్చారు. ఈనెల ఆరో తేదీ వరకే అభయహస్తం పతకం కింద దరఖాస్తులు స్వీకరించబడుతాయని, ఇంకా దరఖాస్తు చేసుకోని వారుంటే త్వరపడాలని, ఈ పతకాలను సద్వినియోగం చేసుకోవాలని మేయర్ సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెఎంసి బిఆర్ఎస్ అధ్యక్షులు సురేష్‌గౌడ్, ఎస్.ఇ శివానంద్, డిఇ యాదయ్య, మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, ఏఇ శ్రీనివాస్‌రెడ్డి, మెప్మా అధికారి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## ఒయూలో కెసిఆర్ కప్ 2024 క్రీడా పోటీలు

బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.తుంగబాలు




క్రీడా పోటీల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్వీ ఉపాధ్యక్షులు తుంగబాలు తదితరులు

తార్నాక, జనవరి 3 ప్రభాతవార్త: ఉస్మానియా యూనివర్సిటీలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో కేసీఆర్ కప్...2024 క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.తుంగబాలు పేర్కొన్నారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శిగ వెంకటేష్ గౌడ్, ఓ.యూ లాకాలేజ్ స్టూడెంట్,ఓ.యూ బీఆర్ఎస్వీ నాయకులు కొంపెల్లి నరేష్ తో కలిసి తుంగబాలు క్రీడలకు సంభదించిన వాల్‌పోస్టర్, బ్రోచర్‌ను ఓ.యూలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తుంగబాలు మాట్లాడుతూ తెలంగాణ జాతిపిత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ భర్త్‌డే సందర్భంగా ఫిబ్రవరి 8 నుంచి పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. గత ఐదు సంవత్సరాలుగా ఓ.యూలో క్రీడలను నిర్వహిస్తున్నామని చెప్పారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. క్రీడల్లో గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ.50వేలు, రెండో బహుమతితో పాటు ఎన్నో బహుమతులు అందజేస్తామని చెప్పారు. క్రీడా కారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు మల్లేష్, సురేష్, రాజు, చందు, చంద్రశేఖర్ రెడ్డి తధితరులు పాల్గొన్నారు.

## శుభకార్యాలు చేసుకోవడానికి అనుమతులు ఇవ్వాలి

చిక్కడపల్లి, జనవరి 3 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ కమ్యునిటీ హాల్‌ను శుభకార్యాలు చేసుకోవడానికి అనుమతులు ఇవ్వాలని ఎస్సార్టీ టిఆర్టీ కాలనీ సొసైటీ సభ్యులు బుధవారం జిహెచ్ఎంసి సర్కిల్-15 డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్యను కోరారు. బుధవారం జవహర్‌నగర్ కమ్యునిటీ హాల్ వద్దకు వచ్చిన డిఎంసి డాక్టర్ తిప్పర్తి యాదయ్యకు కాలనీ సంఘం ప్రతినిధులు నర్మెట్ట మల్లేష్, రత్నాసాయిచంద్, మారిశెట్టి నర్సింగరావు, గుండు సురేందర్, గుండు జగదీశ్, బాబ్జీ, దినేష్, సాయిలు, కృష్ణ, బాబురావు, కమర్, శ్రీను, నగేష్ తదితరులు కలిసి ఫిర్యాదు చేశారు. జవహర్‌నగర్ కమ్యునిటీ హాల్ స్థానికులు పెళ్ళిలు, శుభకార్యాలు చేసుకోవడానికి నిర్మించారని, కాని కమ్యునిటీ హాల్‌లో నియోజకవర్గానికి సంబంధించిన బతుకమ్మచీరలు, ఇతర వస్తువులు పెట్టడంతో హాల్‌లో ఎలాంటి కార్యక్రమాలు చేసుకోవడానికి అనుమతులు ఇవ్వడం లేదని పేర్కొన్నారు.

## సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి



సావిత్రిబాయి పూలేకు నివాళులు అర్పిస్తున్న మేకల సారంగపాణి

సికింద్రాబాద్, జనవరి 3 ప్రభాతవార్త: సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా సికింద్రాబాద్ నియోజ కవర్గం లోని పలు ప్రాంతాలలో వేడుక లను ఘనంగా జరిపా రు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

శ్రీనివాస్‌నగర్‌లో.. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా బీజేపీ నేతలు మేకల కీర్తి హర్షకిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యాక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే మేకల సారంగపాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె చిత్రపటా నికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆమే చేసిన సేవలను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసు కోవాలని సూచించారు. ఈ కార్యాక్రమంలో కనకట్ల హరి, ఆకుల నాగభూషణం, సాయి యాదవ్, సతీష్, లత, సరిత, శ్రీకాంత్, రమేష్, అంజి, సందీప్‌గిరి, శేఖర్ పాల్గొన్నారు.

**ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో..** పార్సిగుట్టలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో సావిత్రి బాయి పూలే 193వ జయంతి సందర్భంగా ఆమే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘ నంగా నివాళులు అర్పించారు. విద్యావ్యాప్తి కోసం, సమాజ అభ్యున్నతి కోసం, మహిళల హక్కుల కోసం ఆమే చేసిన త్యాగం చారిత్రత్మకమైందని అన్నారు. ఈ కార్యాక్రమంలో డప్పు మల్లికార్జున్ మాదిగ, విష్ణు, రాజశేఖర్, శ్రీనివాస్, మహేష్, రవి, లింగం, గణేష్, దశరథ్ పాల్గొన్నారు.

### క్రమశిక్షణతో కూడిన విద్యను అందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది

**సిఐ విజయ కుమార్**



యూసుఫ్‌గూడ, జనవరి 3, ప్రభాతవార్త : క్రమశిక్షణతో కూడిన విద్యను అందించే బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందని సిఐ విజయ కుమార్ అన్నారు. బోరబండ సైట్ త్రీలోని నాట్కో ప్రభుత్వ పాఠశాలలో హెడ్ ఇంజురీ ఆధ్వర్యంలో సిఐ విజయ కుమార్, మండల డిప్యూటీ రామలింగం, సేవ్ ఫౌండేషన్ చైర్మన్ ఎంఏ బేగ్, దూడ రవిగౌడ్‌లు పాల్గొని, పాఠశాల విద్యార్థులకు హెల్మెట్లను అందజేశారు. సిఐ విజయ కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నుంచి కాపాడుకునేందుకు హెల్మెట్లు ధరించాలన్నారు. చదివే ఉన్నత శిఖరాలను చేరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షులు మధుసూదన చారి, ఎజాస్ బేగ్, ఉమా, గీత, చంద్రశేఖర్, రేహాన్, యాసిన్ పాల్గొన్నారు.

### జాతి నిర్మాణంలో ఏఏఐ పాత్ర విలువైంది

హెచ్‌సిఏ అధ్యక్షులు జగన్మోహన్‌రావు



టాస్‌వేస్తున్న హెచ్‌సిఏ అధ్యక్షులు జగన్మోహన్‌రావు

హైదరాబాద్, జనవరి 3,ప్రభాతవార్త: దేశీయ విమానరంగం అభివృద్ధిలో ఎయిర్‌పోర్టు ఆథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)పాత్ర చాలా విలువైందని హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సిఏ) అధ్యక్షులు అర్శనపల్లి జగన్‌మోహన్‌రావు అన్నారు. బుధవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని ఏవోసి క్రికెట్ గ్రౌండ్‌లో ఆలిండియా ఏఏఐ ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి జగన్మోహన్‌రావు ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంభించారు. ఈనెల 7వ తేదీ వరకు జరగనున్న ఈటోర్నమెంట్‌లో ఎనిమిది ఏఏఐ టీమ్‌లు తలపడుతున్నాయి. పోటీల ప్రారంభానికి ముందు ఏఏఐ సిబ్బంది గౌరవ వందనాన్ని జగన్‌మోహన్ రావు స్వీకరించారు. ఈసందర్భంగా జగన్మోహన్‌రావు మాట్లాడుతూ తొలుత దేశ వ్యాప్తంగా ఉన్న సుమారు 18వేల మంది ఏఏఈ ఉద్యోగులకు హెచ్‌సిఏ తరపున నూతన సంవత్సర శుభకాంక్షలు తెలిపారు. అత్యంత ఒత్తిడితో కూడిన ఉద్యోగంలో విధులు నిర్వహిస్తూ కూడా సరదాగా కాకుండా క్రికెట్‌ను ఇంత ప్రొఫెషనల్‌గా ఆడుతుండటం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో హెచ్‌సిఏ సిఈవో సునీల్, ఏఏఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.స్వామినాథన్, ఏఏఐ ట్రేడ్ యూనియన్ జాతీయ అధ్యక్షులు ఎస్.ఆర్.సంతానం, జిఎం ఏఏఐ పీకే హాజారీ పాల్గొన్నారు.

### ఘనంగా సావిత్రి భాయి పూలే జయంతి



కార్యక్రమంలో పాల్గొన్న తోకల శ్రీనివాస్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 3 ప్రభాతవార్త : కుల వివక్షతకు,బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీర వనిత,మహిళల విద్యాభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేసిన ఉద్యమ కారిణి సావిత్రి భాయి పూలే అని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సావిత్రి భాయి పూలే 193వ జయంతి సందర్భంగా కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి సావిత్రి భాయి పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలో స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలి తరం మహిళా ఉద్యమ కారిణి అని గుర్తు చేశారు. కార్యక్రమంలో పూలే కమిటి సభ్యులతో పాటు పలువురు పాల్గొన్నారు.



అయోధ్య రామజన్మ భూమి రామమందిరం అక్షితల యాత్రలో పాల్గొన్న బిజెపి నాయకులు డి.గోపాల్‌జీ తదితరులు

## రామమందిరం అక్షింతల యాత్ర

బేగంబజార్, జనవరి 3ప్రభాతవార్త: దేశ వ్యాప్తంగా అక్షితల యాత్రలో భాగంగా గోషామహల్ నియోజకవర్గంలో అయోధ్య రామజన్మభూమి రామమందిరం అక్షిత యాత్రను నిర్వహించారు. ఈ యాత్రలో మహిళలకు అక్షితలతో కూడిన కలశాలను బిజెపి నాయకులు డి.గోపాల్‌జీ అందచేశారు.ఈ నెల 22వ తేదిన జరిగే ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని అందరూ వీక్షించాలని,రాత్రి ఇళ్లలో 5దీపాలను వెలిగించాలని కోరారు.దీపావళి లాగా ఘనంగా జరుపుకోవాలన్నారు. ఎన్నో వందల ఏళ్ల కల సాకారం అవుతుందన్నారు.ప్రతి హిందువు పండుగలా జరుపుకోవాలన్నారు.

### అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర ఎంతో కీలకం : ఎమ్మెల్యే వివేకానంద




ఎమ్మెల్యే వివేకానందను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

పేట్‌బషీరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త : పేట్ బసీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం రావి నారాయణరెడ్డి నగర్ (తూర్పు) వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు స్థానిక కార్పోరేటర్ రావుల శేషగిరి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కెపి వివేకానందను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమా సంఘాల ఎన్నికల్లో ఏకగ్రీవ ఎన్నిక అనేది అరుదు అని, కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకమన్నారు. రావి నారాయణరెడ్డి నగర్ (తూర్పు) వెల్ఫేర్ అసోసియేషన్ అభివృద్ధికి నా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే వివేకానంద శుభాకాంక్షలు తెలిపారు.

### విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



సైన్స్ వర్క్‌షాప్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

హైదరాబాద్, జనవరి 3 ప్రభాతవార్త: విద్యార్థులు విజ్ఞాన పెంపొందించుకుని సామాజాభివృద్ధికి కృషి చేయాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. ఈ మేరకు బుధవారం నల్లకుంటలోని కేర్ మోడల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ఈ సైన్స్ వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. విజ్ఞాన శాస్త్రం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడంలో కృషి చేసిన స్కూల్ కరస్పాండెంట్ ఆవుల పద్మను ఎమ్మెల్యే అభినందించారు.

### బిఆర్ఎస్‌కు మద్దతు తెలిపిన లోకదళ్

సైఫాబాద్, జనవరి 3 ప్రభాతవార్త: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని భారత జాతీయ లోక్‌దళ్ పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం నాడిక్కడ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకట రాజేశ్వర్‌రావు అధ్యక్షత వహించారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగా కాకుండా రాష్ట్రంలోని 17 లోక్‌సభలో ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థుల విజయం కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటిలను అమలు చేయాలని, ప్రజలు ఏలాంటి ఇబ్బందులకు గురికాకుండా చూడాలని కోరారు. బిజెపి అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను దృష్టిలో పెట్టుకుని లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు రాము, శివ, అయోధ్య, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఒయూ నుంచి సచివాలయం వరకు బస్సు కార్లతో తరలి వెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు




సచివాలయం వరకు బస్సు యాత్రతో వెళ్లుతున్న లోకేష్ యాదవ్

తార్నాక, జనవరి 3 ప్రభాతవార్త: టీపీసీసీ అధికార ప్రతినిధి, ఓయూ జేఏసీ చైర్మన్ లోకేష్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం ఓ.యూ నుంచి సచివాలయం వరకు బస్సు, కార్లతో ర్యాలీగా సచివాలయానికి వెళ్లారు. సచివాలయానికి చేరిన లోకేష్ యాదవ్ బృందం మంత్రులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు పొన్నం ప్రభాకర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భట్టికి శాలువా కప్పి అభినందనలు తెలిపారు. భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో పాల్గొన్నటువంచి ఫోటోను లోకేష్ యాదవ్ జ్ఞాపికగా అందజేశారు. భట్టి పార్టి గులుపుకోసం 1365 కిలో మీటర్ల మేరకు పాదయాత్ర చేస్తూ బీఆర్ఎస్ చేసిన అన్యాయాలను ఎండగట్టి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని గుర్తు చేశారు. ఆయన వెంట తాను పాల్గొని ప్రజా సమస్యలను తెలుసుకోవడం సంతోషాన్ని కల్గించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలనను ఎస్సీ,ఎస్టీ మైనార్టీ, బీసీలకు 60 శాతం అవకాశాలు కల్పిస్తారని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు వినయ్ యాదవ్, వికాస్ యాదవ్, చంద్రయ్య, వీరు యాదవ్, ఒరుగంటి విష్ణు, శ్రీను, మనోహర్, గణేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# శుభాకాంక్షల వెల్లువలు

### కెటిఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన కూకట్‌పల్లి ఎమ్మెల్యే, బిఆర్ఎస్ శ్రేణులు..



కెటిఆర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మాధవరం

**కెపిహెచ్‌బి కాలనీ..** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కెటిఆర్‌ని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొత్త సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలందరికీ మంచి జరగాలని ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కెటిఆర్ ఆకాంక్షించారు. రాబోయే పార్లమెంట్ ఎలక్షన్లకు బిఆర్ఎస్ శ్రేణులు సన్నద్ధం కావాలని దిశా నిర్దేశం చేశారు. అలాగే బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గం కో ఆర్డినేటర్ సతీష్ అరోరా, కార్పోరేటర్లు ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీష్‌గౌడ్, జూపల్లి సత్యనారాయణ, పగుడాల శిరీషబాబురావు, సబియా గౌసుద్దీన్, మహేశ్వరి శ్రీహరి, మందడి శ్రీనివాసరావు, మాజీ కార్పోరేటర్ తూము శ్రవణ్ కుమార్, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ రాములు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

### ఎంపీ రంజిత్‌రెడ్డికి నూనత సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ శ్రేణులు

చేవెళ్ళ ఎంపి రంజిత్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ బస్తి అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి బుధవారం రంజిత్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కూకట్‌పల్లి డివిజన్ ప్రధాన కార్యదర్శి మొగుళ్ళ కనకారెడ్డి, బస్తి నేతలు శరత్‌రెడ్డి, రాముగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆరు గ్యారెంటీలను సద్వినియోగం చేసుకోవాలి



హనుమంతరెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**జీడిమెట్ల..** కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారెంటీలను ప్రజా పాలనను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కొలన్ హనుమంతరెడ్డి సూచించారు. బుధవారం సుభాష్ నగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు ఇన్నారెడ్డి అనుచరులు హనుమంతరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో ఆరు గ్యారెంటీలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందేవిధంగా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కేంద్రాల వద్ద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్థానిక నేతలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జనవరి 6వ తేదీలోగా నిరుపేదలందరూ దరఖాస్తు చేసుకునేలా ప్రచారాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుభాష్‌రెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

### నేరాల నివారణలో యువకుల, ప్రజల సహాయసహకారాలు అవసరం

**సికింద్రాబాద్..** నేరాల నివారణలో యువకుల, ప్రజల సహాయసహకారాలు అవసరం ఉంటాయని ఈస్ట్‌జోన్ డీసీపీ సునిల్‌దత్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా కాంగ్రెస్ సీతాఫల్‌మండి, మెట్టుగూడ డివిజన్‌ల అధ్యక్షులు బండి అభిషేక్ ముదిరాజ్, రవిచంద్ర కుమార్‌లు ఈస్ట్‌జోన్ డీసీపీ సునిల్‌దత్‌ను కలిసి శుభాకాంక్షలె తెలిపారు. పుష్పగుచ్చాని అందజేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ క్రైం రేట్‌ను జీరోగా మార్చడం కోసం పోలీస్‌శాఖ తీవ్రంగా కృషి చేస్తోందని, ఇందుకోసం పౌరుల సహకారం అందించాలని కోరారు. ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించినప్పుడే నేరాల నివారణ, నియంత్రణ సాధ్యమవుతుందని సునిల్‌దత్ పేర్కొన్నారు. అనంతరం చిలకలగూడ ఏసీపీ వి. జయపాల్‌రెడ్డి, వారాసిగూడ ఇన్‌స్పెక్టర్ శంకర్‌లను కలిసి శుభాకంక్షలు తెలిపారు. ఈ కార్యాక్రమంలో కాంగ్రెస్ నేతలు సాయి మధుకర్, పాపాలాల్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

### డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిలిన గౌరీ శంకర్

**బేగంపేట..** రాష్ట్ర ఉపముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్కను కాంగ్రెస్ సీనియర్ నేత, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఏఐసీసీ సభ్యులు గౌరీ శంకర్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు. బుధవారం ప్రజా భవన్ లో ఆయనను కల్సి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 6గ్యారెంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసికెళ్లాలని డిప్యూటీ సీఎం తనకు చెప్పినట్లు గౌరీ శంకర్ తెలిపారు.



వాణిజ్య పన్నులశాఖ కమీషనర్ టి.కె.శ్రీదేవి బొకె అందచేస్తున్న టిఎన్‌జిఓ వాణిజ్య పన్నులశాఖ ప్రతినిధులు

**అఫ్జల్‌గంజ్..** నూతన సంవత్సరం సందర్భంగా తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ కమీషనర్ టి.కె.శ్రీదేవిని తెలంగాణ నాన్ గజిటెడ్ అధికారుల సంఘం వాణిజ్య పన్నులశాఖ అధ్యక్షులు రావుల ప్రదీప్ కుమార్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రహ్మత్‌అలీ, సహ అధ్యక్షులు హరిప్రసాద్, కోశాధికారి దేవుల పల్లి శ్రీనివాస్‌రావు కలిసి బొకె అందచేశారు. ఈకార్యక్రమంలో ఉప అధ్యక్షులు మధు, ప్రభాకర్, శ్రీరామ్, డివిజన్ అద్యక్షులు సందీప్, సయ్యద్ నాగునాయక్ తదితరులు పాల్గొన్నారు.

### కె.యం. ప్రతాప్, కెపి విశాల్‌గౌడ్‌లకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సానిటరీ సిబ్బంది

**పేట్‌బషీరాబాద్..** నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ 25 జిహెచ్ఎంసికి సంబంధించిన సానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు (ఎస్ఎఫ్ఏ), దుండిగల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు జగద్గిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ నాయకులు రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు కె.యం ప్రతాప్, యువనేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కెపి విశాల్‌గౌడ్‌లను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

### టిపిసిసి ప్రధాన కార్యదర్శి జ్యోత్స్న శివారెడ్డిని కలిసిన ఎన్ఎస్‌యుఐ సభ్యులు

**పేట్‌బషీరాబాద్..** తెలంగాణ ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రాకేష్ ముదిరాజ్ బుధవారం టిపిసిసి ప్రధాన కార్యదర్శి జ్యోత్స్నని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ కార్యదర్శి పృథ్విరాజ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎన్ఎస్‌యుఐ ప్రధాన కార్యదర్శి సాయి అవినాష్, కార్యదర్శి దారరవి కిరణ్, ముఖ్య నాయకులు సాయి టింకు, సందీప్, వినీత్, ఆకాష్, బాబి తదితరులు పాల్గొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## మాదక ద్రవ్యాల పట్టివేతలో జీడిమెట్ల 2023 వార్షిక నివేదిక

కుత్బుల్లాపూర్, జనవరి 3 ప్రభాతవార్త : ఈ యేటి వార్షికవేదికగా మాదక ద్రవ్యాల పట్టివేతలో మేటి ప్రతిభ కనబర్చడంతో పాటు శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో జీడిమెట్ల పోలీసులు సమర్థంగా వ్యవహరించారనే చెప్పాలి. 2022-23 సంవత్సర నేరాల నివేదికలో జీడిమెట్ల పోలీసులు తమ ప్రతిభ చాటారనే చెప్పాలి. ప్రత్యేకంగా మాదకద్రవ్యాల నిరోధంలో స్థానిక పోలీసులు ప్రత్యేక నిఘాతో ఏకమొత్తంలో 758 కేజీల గంజాయిని స్వాదీనం చేసుకుని అంతరాష్ట్ర ముఠాను అరెస్టుచేశారు. వీటికితోడు స్థానికంగా శాంతి భద్రతలపరిరక్షలోనూ ప్రత్యేక చర్యలు చేపట్టి సైబరాబాద్ పోలీసు కమిషనర్ మన్ననలను పొందారు. క్రైమ్ నెంబరు 471/2023యు/ఎస్20(సి)ఎన్‌డిపిఎస్ చట్టంలో భాగంగా భారీగా సుమారు 758కేజీల గంజాయిని స్వాదీనం చేసుకున్నారు. మరో కేసులో 968/2023యు/ఎస్‌ఒ(బి)2(సి)ఎన్‌డిపిఎస్ చట్టంలో భాగంగా 400కిలోల గంజాయిని పట్టుకుని నేరస్తులను అరెస్టుచేసి రిమాండ్ కు పంపారు. అలాగే 846/2019 కేసును ఛేదించి నేరస్తుడికి 20ఏళ్ల జైలుశిక్షపడేలా చేశారు. ఎంసిసి కేసులలో భాగంగాముగ్గురిని అరెస్టుచేశారు. బైండోవర్ కేసులలో 45 మందిని అదుపులోకి తీసుకున్నారు. అక్రమ మద్యసరఫరా కేసులో 30 కేసులు, నగదు చోరీల కేసులో 20మందిని అరెస్టుచేసి రిమాండ్ కు తరలించారు. 2023లో మొత్తం 59శాతం నేరస్తుల నుండి సొత్తుస్వాదీనం చేసుకున్నారు. మొత్తం9116453 సొత్తుకు గాను 5437700సొత్తును స్వాదీనం చేసుకున్నారు. అంటే సుమారు 59.65శాతం సొత్తును నేరస్తుల నుండి పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. ఈసందర్భగా జీడిమెట్ల సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ పవన్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల సరఫరాలో ఎంతటి వారు పట్టుబడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



## రోబోటిక్స్ ఈవెంట్స్ పోస్టర్ ఆవిష్కరణ

నిజాంపేట్, జనవరి 3, ప్రభాతవార్త : బాచుపల్లిలోని వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి స్కూల్‌లో ఈనెల 6,7వ తేదీలలో జరగబోవు దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద రోబోటిక్స్ ఈవెంట్స్ పోస్టర్‌ను బుధవారం వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి స్కూల్ డైరెక్టర్ కొడాలి విజయరాణి, ప్రిన్సిపాల్స్ మీడియా ప్రతినిధుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయరాణి మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోని వివిధ పాఠశాలల నుండి 500మందికి పైగా విద్యార్థులు ఈవెంట్‌లో పాల్గొనబోతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు ముందున్న నేటి పోటీ ప్రపంచంలో రోబోటిక్స్ యొక్క ప్రాముఖ్యతను కూడా ఆమె ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో డే స్కూల్ ప్రిన్సిపాల్ రవి, రెసిడెన్సియల్ స్కూల్ ప్రిన్సిపాల్ గీత తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఉత్తమ్‌కు అభినందనలు తెలుపుతున్న ఆదం సంతోష్



కంటోన్మెంట్, జనవరి 3 ప్రభాతవార్త: సికింద్రాబాద్ నియోజకవర్గం కన్‌టెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్‌కుమార్ బుధవారం రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కె.ఎం.ప్రకాశ్ పాల్గొన్నారు.

## సామాజిక విప్లవానికి సావిత్రిబాయి పూలే : కల్పన



సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తున్న డి.బి.ఎఫ్. కార్యదర్శి పులి కల్పన

అడ్డగుట్ట, జనవరి 3 ప్రభాతవార్త: సామాజిక విప్లవానికి సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ (డి.బి.ఎఫ్), రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన తెలిపారు. సావిత్రిబాయి పూలే 193వ జయంతిని పురస్కరించుకొని బుధవారం అడ్డగుట్ట, తుకారాం గేట్, రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లలో ఏర్పాటు చేసిన వేడుకలకు ఆమె ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. మహిళలకు విద్యా బోధన అందించిన తొలి మహిళా సావిత్రిబాయి పూలే అన్నారు. విద్యను హక్కుగా అమలు చేయాలన్నారు. సమాజ మార్పు కోసం మహిళలు ప్రముఖ పాత్ర పోషించాలన్నారు.

## లబ్దిదారులకు న్యాయం : పులిపాటి రాజేష్ కుమార్




చార్మినార్, జనవరి 3 ప్రభాతవార్త : ప్రజా పాలన సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు కోసం దరఖాస్తులు చేసుకున్న లబ్దిదారులందరికి న్యాయం జరుగుతుందని బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ పులిపాటి రాజేష్ కుమార్ అన్నారు. దూద్‌బౌలిలోని శివాజీ ప్లే గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రాజేష్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఉద్యోగులు పీటర్ సన్, మహేందర్‌లు పాల్గొన్నారు.



ఒయూలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

## ఒయూ నుంచి చెరువుగట్టుకు
# విద్యార్థి నాయకుల పాదయాత్ర

తార్నాక, జనవరి 3 ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సందర్భంగా, కోమటిరెడ్డి బ్రదర్స్, నకిరేకల్ ఎమ్మెల్యేగా వేముల వీరేశం భారి మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి చెరువు గట్టు వరకు వారు అనుచరులు పాదయాత్రను ప్రారంభించారు. ఓ.యూలో వేముల వీరేశం అనుచరులు, ఒ.యూ జేఏసీ ఉపాధ్యక్షులు పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నోముల శేషు యాదవ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం టీఎస్‌పీ జాక్ స్టేట్ ప్రసిడెంట్, ఒ.యూ కాంగ్రెస్ నాయకుడు వలిగొండ నరసింహ సమన్వయకర్తగా 50 మంది విద్యార్థులతో కూడిన బృందం ఒ.యూ నుంచి చెరువుగట్టు వరకు పాదయాత్రను ప్రారంభించారు. ఈ యాత్రను మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్, సైన్స్ డీన్ ప్రొ.అర్జున్ రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంపాల రాజేష్, ఉదయ్‌కుమార్, శ్రీధర్ దయాకర్, కాంగ్రెస్ నాయకురాలు, ఒ.యూ విద్యార్థి నేత చుక్క లత విశ్వజన్, పద్మ, ఏఐఎస్ఎఫ్ ఉదయ్ రెడ్డి, శ్రీను, అజయ్, బండి నరేష్, పద్మయాదవ్, నల్లలత, బోనాల నగేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## జనసేన ఆధ్వర్యంలో కెపిహెచ్‌బి కాలనీలో సావిత్రిబాయి పూలే జయంతి




జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రేమ కుమార్

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 3, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ ఆధ్వర్యంలో కెపిహెచ్‌బి కాలనీ 5వ ఫేస్ పార్టీ కార్యాలయం వద్ద చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 193 జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి సావిత్రిబాయి పూలే చి త్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భారతీయ సంఘ సంస్కర్త అని, ఉపాధ్యాయిని రచయిత్రి అని, ఆమె అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని అన్నారు. కులమత బేధాలు లేకుండా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ స్వరూపిణీ అని కొనియాడారు. ఆధునిక విద్య ద్వారా స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని సావిత్రి బాయి పూలే తన జీవితాంతం ప్రజల కోసమే బతికారని, పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించారని, నూతన వ్యవస్థ కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాటం చేశారని అన్నారు. భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని, స్త్రీల అభివృద్ధి కోసం విద్యాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేశారని, స్త్రీలను చైతన్య పరచడానికి 1852లో మహిళా సేవా మండల్ అనే మహిళా సంఘాన్ని స్థాపించారని, మహిళా హక్కులే మానవ హక్కులనీ తొలిసారిగా నినదించిన సావిత్రి బాయి పూలే సతిసహగమనానికి వ్యతిరేకంగా వితంతువు పునర్వివాహ కొరకు అసమాన బ్రాహ్మణిజం వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపారని తెలిపారు. గర్భవతులైన వారికి పురుడు పోసి వారి కళ్ళల్లో వెలుగు చూశారని, వితంతువులకు శిరోముండనం చేయడాన్ని తీవ్రంగా ఖండించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయండి : ఎమ్మెల్యే తలసాని ఆదేశం



రాంగోల్‌పేట డివిజన్‌లో పర్యటిస్తూ ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న తలసాని

బేగంపేట జనవరి 3, ప్రభాతవార్త : అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నియోజకవర్గం పరిధిలోని రాంగోపాల్‌పేట డివిజన్ లోని చుట్టల బస్తీ, నల్లగుట్ట వార్డు ఆఫీసు, జేలైన్, ఎఫ్‌లైన్, సీలైన్ తదితర ప్రాంతాలలో వివిధ శాఖల అధికారులతో కల్సి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెల్సుకున్నారు. జేలైన్ లో కలుషిత నీరు సరఫరా అవుతుందని స్థానిక మహిళలు ఎమ్మెల్యే తలసాని దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన తలసాని సమస్య పరిష్కారం కోసం నూతన సీవరేజ్ ,వాటర్ పైప్ లైన్ పనులను మంజూరు చేసినట్లు చెప్పారు. 2,3 రోజులలో పనులను ప్రారంభించడం జరుగుతుందని వివరించారు. పలు రోడ్లలో సీవరేజ్ నుంచి ఓవర్ ఫ్లో అయి మురుగు నీరంతా రోడ్లపై ప్రవహిస్తుందని, దీంతో తాము ఇబ్బందులు పడుతు న్నామని స్థానికులు తెలపగా ,స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సీలైన్ లో నూతనంగా సీవరేజ్ లైన్ ఏర్పాటు చేశారని, కానీ మ్యాన్ హోల్స్ నిర్మాణాన్ని అసంపూర్తిగా చేసారని, మంత్రికి స్థానికులు వివరించగా వెంటనే నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిసి శంకరయ్య, మాజీ కార్పోరేటర్లు అత్తెల్లి అరుణా శ్రీనివాస్‌గౌడ్, కొసికే కిరణ్మయి కిషోర్, మల్లిఖార్జున్ గౌడ్, వాటర్‌వర్క్స్ డిజీఎం శశాంక్, సురేష్. బీఆర్ఎస్ నాయకులు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, ఆంజనేయులు, అరుణ్‌భట్, సతీష్, గణేష్, నిర్మల, ఆర్.సత్యనారాయణ, రాజేష్ తదితరులు ఉన్నారు.

## 'న్యాయ సంహిత రోడ్‌న యాక్సిడెంట్ బిల్' ప్రతుల దగ్ధం

### వెనుక్కు తీసుకోకపోతే దేశవ్యాప్తంగా రవాణా సమ్మె చేస్తాం



'న్యాయ సంహిత రోడ్‌న యాక్సిడెంట్ బిల్' ప్రతులను దగ్ధం చేస్తున్న బిఎంఎస్ కార్మిక సంఘం నాయకులు

చిక్కడపల్లి, జనవరి 3 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'న్యాయ సంహిత రోడ్‌న యాక్సిడెంట్ బిల్'ను వ్యతిరేకిస్తూ భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహాసంఘ్(బిఎంఎస్ అనుబంధం) ఆధ్వర్యంలో ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లో బిల్ ప్రతులను డ్రైవర్లు తగులబెట్టే కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిపిటిఎంఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఆల్లూరి రవిశంకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయసంహిత బిల్‌ను వెంటనే వెనక్కు తీసుకోవాలని, లేకపోతే దేశవ్యాప్తంగా రవాణా సమ్మె చేస్తామని హెచ్చరించారు. న్యాయ సంహిత పేర్కొన్న విధంగా ఏదైనా డ్రైవర్ యాక్సిడెంట్ చేసిన తర్వాత తప్పించుకుంటే ఆ డ్రైవర్‌కు 10 సంవత్సరాల జైలు, రూ.7లక్షల జరిమానా విధానాన్ని వెనక్కు తీసుకోవాలని, ఐఆర్‌డిఏ పెంచిన ప్రైవేట్ రవాణా వాహనాల ఇన్స్యూరెన్స్‌ను వెంటనే 50శాతం తగ్గించాలని, రవాణా వాహనాలకు వివిధ రకాల ఉన్న టాక్స్‌ను దేశవ్యాప్తంగా ఒకేదేశం-ఒకే టాక్స్ అనే విధానం చేపట్టాలని, రవాణా వాహనాల డ్రైవర్ల కుటుంబాలకు రూ.10 లక్షల ఆరోగ్య భీమ, ప్రమాద సహజ మరణ బీమా కల్పించాలని, జాతీయ రహదారులపై డ్రైవర్లు కొరకు విశ్రాంతి గృహాలు, సబ్సిడీ క్యాంటీన్‌లు, ప్రాథమిక వైద్యశాలలు నిర్మించాలని, దేశవ్యాప్తంగా డ్రైవర్లపై ఆర్‌టిఏ అధికారుల జులుం, ఆర్థిక దోపిడీలను అరికట్టాలని డిమాండ్‌చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ ప్రైవేట్‌ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహాసంఘ్ ఉపాధ్యక్షుడు హబీబ్, శంకర్, మినీ గూడ్స్‌వెహికల్ యూనియన్ నాయకులు శ్రీనివాస్ మూది రాజ్, జహంగీర్, మనోజ్, ఆటోయూనియన్ నాయకులు పెంటయ్య, నందకిషోర్, కిషన్, రాములు, మహేష్, రంగ పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత అల్పాహారం పంపిణీ



మణికొండ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత అల్పాహారంను పంపిణీ చేస్తున్న దృశ్యం

నార్సింగి, జనవరి 3 ప్రభాతవార్త : మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు బుధవారం ఉచిత అల్పాహారం కార్యక్రమంను ప్రారంభించారు. సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను పురస్కరించుకొని విద్యార్థులకు ఈ ఉచిత అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మణికొండ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులకు మెరుగైన విద్యాబోధనను అందించేందుకు ఉపాధ్యాయులు తమ పని వేళలకు అదనంగా పాఠశాలల్లో అందుబాటులో ఉంటున్నారు. పదో తరగతి పరీక్షలు ముగిసేంత వరకు ఈ ఉచిత అలప్పాహార కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బిఆర్ఎస్ అధ్యక్షులు బుద్దోలు శ్రీరాములు, కౌన్సిలర్ వసంత్ చౌహాన్, నాయకులు ఏర్పుల కుమార్, పాఠశాల అధ్యాపక గణం పాల్గొన్నారు.

### బిజెపి ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గసభ్యుడుగా దోనేటి సత్యం

చిక్కడపల్లి, జనవరి 3 ప్రభాతవార్త: బిజెపి ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు(సోషల్‌మీడియా)గా గాంధీనగర్ డివిజన్‌కు చెందిన దోనేటి సత్యం ఎంపికయ్యారు. ఈ మేరకు ఓబీసి సెల్ రాష్ట్ర మోర్చ అధ్యక్షుడు ఆలె భాస్కర్ రాజ్ నూతనంగా ఎంపికైన దోనేటి సత్యంకు నియామకపత్రాన్ని అందించారు. బిజెపి పార్టీ సిద్ధాంతం, ఆదర్శాలకు అంకితమై పనిచేయాలని, చురుగ్గా పాల్గొన్న వారికి సముచిత స్థానం తప్పక లభిస్తుందన్నారు. మోడీ ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను సోషల్‌మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

## హిందీ ప్రచార సభపై తప్పుడు ఆరోపణలు చేశారు

సైఫాబాద్, జనవరి 3 ప్రభాతవార్త: పూర్వ ఉద్యోగుల పేరిట హిందీ ప్రచార సభ హైదరాబాద్ సంస్థ సభ్యులపై చేసిన ఆరోపణలలో వాస్తావాలు లేవని హిందీ ప్రచార సభ హైదరాబాద్ ఉద్యోగుల సంఘం స్పష్టం చేసింది. బుధవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షుడు నామ్‌దేవ్ వాగ్మోడే, కార్యదర్శి శివలింగంగౌడ్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంస్థ విస్తరణలో భాగంగా రాజేంద్రప్రసాద్‌కపూర్‌ను మూడేళ్ల క్రితమే బదిలీ చేస్తే విధుల్లోకి చేరలేదని, మహేష్‌సింగ్, నమ్రతలు ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచార సభ ఉద్యోగులని రాష్ట్ర విభజన తరువాత అనంతపురంకు బదిలీ అయినారని అక్కడకు వెళ్ళలేదని ఆరోపించారు. లక్షల మంది హిందీ ఉపాధ్యాయులను తయారు చేసిన ఘనత హిందీ ప్రచార సభకు ఉందన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

నిట్ సం. 27/GHMC/MPT/EE/2023-24.

పనిపేరు: పూడికతీత పని. అంచనా మొత్తం/ECV : రూ.32.00 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: 05.01.2024, మ.3.00గం. 11.01.2024 మ.1.00గం. అధికారి పేరు, చిరునామా : శ్రీ పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, GHMC, మూసాపేట సర్కిల్-23, సెల్: 9989930362. తదుపరి వివరాలకు 'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ www.tender.eprocurement.gov.in వద్ద చూడవచ్చును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, GHMC, మూసాపేట డివిజన్-23.

DIPR.No.9125-PP/CL/Advt/1/2023-24 తేదీ: 03.01.2024







**IN THE COURT OF THE HON'BLE XXIV ADDL CHIEF JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD**
**O.S. No. 576 of 2023**

**Between:**
1. Smt Nelapatla Chandrakala, W/o Late Nelapatla Rami Reddy, Aged about. 65 years, Occ. Housewife, R/O H.No-10-3-311/20, Castle Hills, Vijayanagar Colony, Near NMDC, Hyderabad.
2. Smt N Kavitha Reddy W/o.S Raja Narasimha Reddy D/o Late Nelapatla Rami Reddy, Aged about. 48 years, Occ. Housewife, R/O H.No-10-3-311/20, Humayun Nagar, Castle Hills, Near NMDC, Hyderabad.
3. NelapatlaSrikanth Reddy S/o. Late Nelapatla Rami Reddy, Aged about 45 years, Occ.pvt-employee, R/O H.No-10-3-311/20, Castle Hills, Vijayanagar Colony, Near NMDC, Hyderabad. Presently residing at 2 Fergus St, Thornhill Park, VIC 3335, Australia. Represented by Petitioner No.1 Smt Nelapatla Chandrakala, W/o Late Nelapatla Rami Reddy, Aged about. 65 years, Occ. Housewife, R/O H.No-10-3-311/20, Castle Hills, Vijayanagar Colony, Near NMDC, Hyderabad.

**... PLAINTIFF'S**

**AND**

1. The Tahsildar, Asif Nagar Mandal, Hyderabad Dist, Telangana State, 500057.
2. The Sub Registrar, Sanjeeva Reddy Nagar(S.R.NAGAR), Hyderabad Dist, Telangana State, 500082.
3. The Commissioner, Ghmc, Hyderabad Dist, Telangana 500063.
4. All Concerned.

**... DEFENDANT'S**

To,
All Concerned (Defendant No.4)

Whereas the Plaintiffs herein have instituted the above Suit OS No.576 of 2023 for declaration, to declare that the Plaintiffs are the only legal heirs of the deceased Nelapatla Rami Reddy, and the above Suit is posted to 31.01.2024 for appearance of the defendant No.4. Take notice that, if anybody is/are having objection/s, they may appear before **IN THE COURT OF THE HON'BLE XXIV ADDL CHIEF JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD,** on 31.01.2024 at 10:30 a.m. either in person or through a counsel duly instructed, failing which the matter will be decided on merits.

**(BY THE ORDER OF THE COURT )**
**Sd/- M/S. ABHINAV KRISHNA UPPALURI**
**VENUGOPALREDDY JAKKIDI**
Advocate
H.No:-17-2-258/11,
Near Saibaba Temple,
Sailalthota, Kurmaguda,
Saidabad, Hyderabad,
Telangana State.

## భయభ్రాంతులకు గురిచేసిన డ్రైనేజీ పేలుడు



చర్లపల్లి వెంకటరెడ్డినగర్‌లో డ్రైనేజీ మ్యానువల్స్ పేలిన దృశ్యం

**కుషాయిగూడ, జనవరి 3 ప్రభాతవార్త :** డ్రైనేజీలో ప్రమాదవశాత్తు పేలుడు సంభవించి మ్యాన్ హోల్స్ ఎగిరిపడి భయభ్రాంతులకు గురిచేసిన సంఘటన చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం చర్లపల్లి వెంకట్‌రెడ్డినగర్ మధుసూదన్‌రెడ్డి నగర్ కాలనీలకు మధ్యలోగల డ్రైనేజీ వ్యవస్థలో గుర్తుతెలియని దుండగులు పేలుడు కెమికల్స్ వేసిన కారణంగా ప్రమాదం సంభవించి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. కెమికల్ ద్వారా పేలుడు సంభవించి మ్యాన్ హోల్స్ ఎగిరి పడి పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు సైతం కిందపడిపోవడం ప్రమాద సంఘటన తీవ్రత ఎంతో తెలుపుతుంది. ఒక్కసారిగా జరిగిన పేలుడు సంఘటనలో భారీగా శబ్దం రావడంతో స్థానికంగా కాలనీలవాసులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉప్పల్ పోలీస్‌స్టేషన్ ఎఎస్ఐ హనుమా నాయక్‌కు ఉత్తమ సేవా అవార్డు

**హైదరాబాద్,జనవరి 3 ప్రభాతవార్త :**ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న హనుమా నాయక్ ఉత్తమ సేవా పతకం అందుకున్నారు. ఈ మేరకు కొత్త సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఈ అవార్డును హనుమానాయక్‌కు ఇస్తూ ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో సిఐ శ్రవణ్‌కుమార్,పలువురు ఎస్ఐలు, ఇతర సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించారు. ఉద్యోగులు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే తగు గుర్తింపు ఉంటుందన్నారు. ప్రజలకు తనవంతు సేవలందించేందుకు కృషి చేస్తానని హనుమానాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాచకొండ పోలీసు అధికారులు హనుమా నాయక్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ అండాళ్ నిలయంలో ఘనంగా కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు



మహిళలకు తాంబూలాలను అందజేస్తున్న రూపాదేవి తదితరులు

**మలక్‌పేట, జనవరి 3 ప్రభాతవార్త :** మూసారాంబాగ్‌లోని శ్రీ అండాళ్ నిలయంలో ధనుర్మాస ఉత్సవాలు నిర్వాహకురాలు ఎ.లక్ష్మీదేవి, రూపాదేవి, రామకృష్ణల ఆధ్వర్యంలో నిత్యం భక్తి శ్రద్దలతో ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. సౌభాగ్యవంతులైన అండాల్ నిలయం భక్తులకు పసుపు, కుంకుమ, గాజులు, తాంబూల వితరణ కార్యక్రమం, 5వతేదీ శుక్రవారం మాతృశ్రీ రిందాదేవి తిరు నక్షత్రం సందర్భం గా మధ్యాహ్నం 12 గంటల నుండి అన్నదాన కార్యక్రమం సాయంత్రం రదిండా శరణ్య నాట్యమండలి శ్రీమతి యశోద బృందంతో నాట్య ప్రదర్శన, 9వతేదీ మంగళవారం ఆండాళ్ నిలయంలో దీపోత్సవం, 12వతేదీన ఆండాళ్‌తల్లికి నీరాటోత్సవం, అనంతరం 108వెండి గంగాళ ములతో అక్కార వడిశల్ విశేష ప్రసాద నివేదన, వితరణ, 14వ తేదీ ఆదివా రం బోగి పండుగ, ఉదయం 10.30గంటలకు గోదా కళ్యాణం ప్రారంభం, సాయంత్రం తిరుప్పావై ఫలశృతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే సబితారెడ్డి చేతుల మీదుగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**సరూర్‌నగర్, జనవరి 3 ప్రభాతవార్త :** మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి గురువారం నియోజకవర్గంలోని మీర్‌పేట్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్లు, జల్‌పల్లి మున్సిపాలిటీలలో లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నారు. ఉదయం 10 గంటల తర్వాత మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశపు మందిరంలో, 11గంటల తర్వాత బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో, మధ్నాహ్నం 12 గంటల తర్వాత జల్‌పల్లి మున్సిపాలిటీలోని కుబా కాలనీ జెజెఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసే సమావేశాల్లో ఆమె చెక్కులను పంపిణీ చేస్తారు.

## గౌడ సంఘం అధ్యక్షునిగా రాజారావుగౌడ్



చీపురు రాజారావుగౌడ్‌ను అభినందిస్తున్న చౌకి రవికుమార్ తదితరులు

**మలక్‌పేట, జనవరి 3 ప్రభాతవార్త :** ఓల్డ్ మలక్‌పేట గౌడ సంఘం అధ్యక్షునిగా చీపురు రాజారావుగౌడ్ ఎన్నికయ్యారు. గౌడ సంఘం అధ్యక్షుడిగా నియమితులైన రాజారావుగౌడ్‌ను మలక్‌పేట ఉత్సవాల కమిటీ ఛైర్మన్ చౌకి రవికుమార్, శ్రీ పోచమ్మ ఆలయ కమిటీ ప్రతినిధి కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, శ్రీ రామచంద్రస్వాఇ ఆలయ మాజీ ఛైర్మన్ బాబు శ్రీనివాస్, బిజెపి దళిత మోర్చ అధ్యక్షుడు రాజు తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాజారావుగౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్థులకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి అభ్యున్నతికి పాటుపడగామన్నారు. అదే విధంగా ఓల్డ్ మలక్‌పేట గౌడ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. త్వరలో నూతన కమిటీని ప్రకటిస్తామన్నారు.



మంత్రి శ్రీధర్‌బాబును చుక్కల చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక ఛైర్మన్ చుక్కల వేణుకుమార్ మర్యాద పూర్వకంగా కలిసి మంత్రికి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్నదాన ట్రస్టు ఛైర్మన్ డి.భగవాన్, సభ్యులు శ్రీనివాస్, చరణ్, చందు తదితరులు పాల్గొన్నారు. (ప్రభాతవార్త, సైదాబాద్)

## ఉప్పల్ డివిజన్‌లో అర్హులైన పేదలందరికి అభయ హస్తం : కార్పొరేటర్ రజితరెడ్డి





ప్రజాపాలన కేంద్రంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కార్పొరేటర్ రజితరెడ్డి

**హైదరాబాద్, జనవరి 3 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్‌లో అర్హులైన పేదలందరికి అభయహస్తంకింద చేయూతంనదిస్తామని స్థానిక కార్పొరేటర్ మందముల రజితరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ శాంతినగర్‌లో ప్రజాపాలన కేంద్రంలో దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సిఎం రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలు అమలు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగంపల్లి రామకృష్ణ, తిక్క ప్రకాష్, అల్వాల భాస్కర్, జనగామ రామకృష్ణ, అనిల్‌కుమార్, చందు, పాలడుగు లక్ష్మణ్, చంద్రశేఖర్‌రెడ్డి, రఘు గుప్త, రూతమ్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్‌లో సావిత్రీబాయి పూలే జయంతి

**సరూర్‌నగర్, జనవరి 3 ప్రభాతవార్త:** మీర్‌పేట్ చౌరస్తాలో కార్పొరేషన్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే 193వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు దాసరి బాబు సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రఘు, రాములు, నాగరాజు, ఉమేష్, దయాకర్, రవి, ప్రభాకర్, రాకేష్, దాసరి అరవింద్, దేవేందర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం (మల్కాజిగిరి, ప్రభాతవార్త)

## చైతన్యనగర్‌లో గడప గడపకు శ్రీరామ అక్షితలు : కార్పొరేటర్ లచ్చిరెడ్డి



శ్రీరామ అక్షితలు అందజేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం, జనవరి 3 ప్రభాతవార్త:** అయోధ్యలోని శ్రీ రామ జన్మభూమిలో పూజించిన స్వామి వారి అక్షితల కలశ భోభాయాత్రను బుధవారం బిఎన్ రెడ్డినగర్ డివిజన్ చైతన్యనగర్‌లో ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ లచ్చిరెడ్డి, కాలనీవాసులు శ్రీరామ అక్షితలకు భక్తి శ్రద్దతలతో స్వాగతం పలికారు. భజనలు, కీర్తనలు ఆలపిస్తూ అక్షితలను కాలనీలో గడప గడపకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు తిప్పర్తి జలంధర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు పాశం భూపాల్‌రెడ్డి, సాయిబాబ దేవాలయ ఛైర్మన్ రాంరెడ్డి, డాక్టర్ మల్లేష్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి అయోధ్య రాముల వారి అక్షింతల పంపిణి శుభప్రదం: నరేందర్‌రెడ్డి



రాముల వారి అక్షింతలను స్వీకరిస్తున్న వనితా నరేందర్‌రెడ్డి దంపతులు

**సరూర్‌నగర్, జనవరి 3 ప్రభాతవార్త:** అయోధ్యలో శ్రీరాముని ఆలయ ప్రారంభోత్సం జరుగునున్న సందర్భంగా నిర వ్రహించిన యజ్ఞ అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేయడం శుభప్రదమని సరూర్‌నగర్ మండల మాజీ జడ్పీటిసి జిల్లెల నరేందర్‌రెడ్డి, జిల్లెలగూడ మాజీ సర్పంచ్ జిల్లెల వనితా నరేందర్‌రెడ్డి అన్నారు. మీర్‌పేట్‌కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో సేవాకార్యకర్తలు అయోధ్య శ్రీరాముని అక్షింతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి, వనిత దంపతులకు సేవా కార్యకర్తలు బి.కవిత, బి.విజయ, బి.శిల్ప, పి.దీపికలు అక్షితలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం కానున్న నేపథ్యంలో పవిత్రమైన అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేయడం పుణ్యకార్యమని అన్నారు.

**మేయర్ పారిజాతకు అక్షింతల అందజేత :** అయోధ్య తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో సీతారాముల వారి అక్షితలను బాలాపూర్‌లోని బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి నివాసంలో ఆమెకు అందజేస్తున్న వారిలో సభ్యులు భూషణ్, నవారు శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్, సమరసింహారెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయం పునర్నిర్మాణంకోసం సహాయం

**హైదరాబాద్, జనవరి 3 ప్రభాతవార్త:** సరూర్‌నగర్ అంబేద్కర్‌నగర్‌లోని నల్ల పోచమ్మ దేవాలయం పునర్నిర్మాణం కోసం మాజి కార్పొరేటర్ అనితా దయాకర్‌రెడ్డి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నల్లపోచమ్మ దేవాలయం పునర్నిర్మాణం కొరకు ఆలయం కమిటి వారు గర్భగుడి పూర్తి నిర్మాణం కోసం సహకారం అందించమని కోరగా అందుకు స్పందించిన అనితాదయాకర్‌రెడ్డి అంబేద్కర్‌నగర్‌లోని నల్లపోచమ్మ దేవాలయంలో కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. దేవాలయం పునర్నిర్మాణం కోసం ఇసుక, స్టీల్, సిమెంట్, ఇటుక కోసం 1.50 లక్షలు ఆర్థిక సహాయాన్ని దేవాలయం కమిటి సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు రాగం ఎల్లయ్యయాదవ్, లోడి నర్సింహగౌడ్, కదారి యాదగిరియాదవ్, మల్లేష్, రామచందర్, దర్గయ్య, భాస్కర్‌రావు, ఏదుల యాదగిరి, డివిజన్ ప్రధానకార్యదర్శి మంచినీళ్ల సుదర్శన్, కోశాధికారి తాటికొండ రాఘవేంద్రగుప్తా తదితరులు పాల్గొన్నారు.

## వాజ్‌పేయినగర్ రైల్వేగేటు వద్ద నెలకొన్న సమస్యలను పరిష్కరించిన ఎమ్మెల్యే మర్రి



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి..

**నేరేడ్‌మెట్, జనవరి 3 ప్రభాతవార్త :** మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. బుధవారం నియోజకవర్గపరిధిలోని వినాయక్‌నగర్‌డివిజన్ వాజ్‌పేయి నగర్ రైల్వే గేటు వద్ద నెలకొన్న విద్యుత్‌లైన్, డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యే వివరించారు. గత కొన్ని రోజులుగా నాలాలో వ్యర్థ పదార్థాలు నిండిపోవడంతో డ్రైనేజీ రోడ్డుపై ప్రవహిస్తుందన్నారు. అంతేకాకుండా 33 కెవి లైన్ రోడ్డు పైనే ఉండడంతో అక్కడి నుండి ప్రయాణించాలంటనే భయంగా ఉందన్నారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధించిన అధికారులతో చర్చించి వెంటనే పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలను పరిష్కరించడానికే తాను ఉన్నానన్నారు. ప్రజలు తమ సమస్యలను తనకు నేరుగా చెప్పవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం సునీల్ కుమార్, డీజిఎం భాస్కర్, మున్సిపల్ ఈఈ లక్ష్మణ్, విద్యుత్ ఏడిఇ శ్రీనివాస్ రెడ్డి, బస్తీ వాసులు పాల్గొన్నారు.

**140 డివిజన్‌లో డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించిన మర్రి :** మల్కాజిగిరి పరిధిలోని బలరాంనగర్ ప్రజలు ఎదుర్కుంటున్న డ్రైనేజీ సమస్యను బుధవారం ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే డ్రైనేజీ సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**దొడ్ల బస్తీ నాలా పరిశీలన : ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి...** మల్కాజిగిరిలోని నియోజకవర్గ పరిధిలో దొడ్ల బస్తీలోని నాలాను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ నాలాలోపేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని ఆయనను కోరారు. దీంతో నాలా సమస్యను ఉన్నతాధికారులతో మాట్లాడి సత్వరమే సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, నాయకులు చిన్నయాదవ్, నీలం సతీష్, శ్రీకాంత్, కోటేశ్వరావు, జయశ్రీ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రి భాయి పూలే అడుగుజాడల్లో నడవాలి: ముద్రబోయిన శ్రీనివాసరావు



సావిత్రిభాయి పూలే విగ్రహానికి పూల మాలలు వేస్తున్న శ్రీనివాసరావు

**సైదాబాద్, జనవరి 3 ప్రభాతవార్త:** సంఘ సంస్కర్త సావిత్రిభాయి పూలే అడుగు జాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని లింగోజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు అన్నారు. సావిత్రిభాయి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ దళిత, బహుజన స్త్రీ జనోద్దరణకు, మహిళా విద్యకు, మహిళా సాధికారతకు సావిత్రి భాయి పూలే తన జీవితాన్ని అంకింతం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## రామోజీ మరణం బిజెపికి తీరని లోటు : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



రామోజీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 3 ప్రభాతవార్త:** రామోజీ షణ్ముగం మరణం పార్టీకి తీరని లోటని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామోజీ షణ్ముగం మృతి చెందడం పట్ల వ్యక్తం చేస్తూ బుధవారం షణ్ముగం భార్య శోభను కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండజిల్లాకు చెందిన షణ్ముగం ఏబీవీపీ నుంచే చురుగ్గా పనిచేస్తూ ఆర్ఎస్ఎస్‌లో కీలకపాత్ర పోషించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాంచంద్రరావు, రాష్ట్ర బిజెపి నాయకులు దాసరి మల్లేష్, బొక్క నరసింహారెడ్డి, కార్పొరేటర్లు రంగ నరసింహగుప్త, బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, నాయకులు రుద్రారపు శంకర్, వినోద్‌యాదవ్, గోపి పాల్గొన్నారు.

## కాలనీల అభివృద్దే ధ్యేయం : నరసింహగుప్త

**హైదరాబాద్, జనవరి 3 ప్రభాతవార్త:** కాలనీల అభివృద్ధి సంక్షేమమే తమ అధ్యయమని చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగా నరసింహాగుప్త పేర్కొన్నారు. చైతన్యపురి డివిజన్‌లోని సాయినగర్‌లోని చిల్డ్రన్ పార్క్ అభివృద్ధి పనులను బుధవారం కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇబ్బందులు కలగకుండా చిల్డ్రన్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినోద్‌కుమార్, శంకర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి ప్రభుత్వ కళాశాలలో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు



సావిత్రి బాయి పులే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ శైలజ

**నేరేడ్‌మెట్, జనవరి 3 ప్రభాతవార్త :** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సావిత్రిబాయి పూలే చేసిన సేవలు గొప్పవని, నేటి యువత ఆమె అడుగు జాడల్లో నడవాలని మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళశాల ప్రిన్సిపల్ వై. శైలజ పేర్కొన్నారు. బుధవారం సావిత్రి బాయి పూలే 133వ జయంతి వేడుకలను కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అణగారిన కులాల అభివృద్దికోసం ఆమె చేపట్టిన అనేక ఉద్యమాలు చేపట్టారని, వితంతు స్త్రీలకు చదువును అందించడంలో ఆమె ముఖ్య పాత్ర పోషించిందన్నారు. చిన్నవయస్సులో జ్యోతిబా పులేతో వివాహం జరిగినప్పటికి ఆయనద్వారా విద్య నేర్చుకొని ఎన్నో వందల మందికి విద్యని అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా విభాగం అధికారి రమేష్, జగన్, మల్లిక, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అకస్మిక తనిఖీలు



ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**హైదరాబాద్, జనవరి 3 ప్రభాతవార్త :** ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అకస్మిక తనిఖీలు చేపట్టారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కల్యాణలక్ష్మి చెక్‌ల పంపిణీలో పాల్గొన్న ఆయన పక్కనే ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు సమయపాలన పాటించడం లేదని అగ్రహం వ్యక్తం చేశారు. విధులకు సరైన సమయంలో రాని అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. వైద్యులు సమయానికి వచ్చి రోగులకు చికిత్సలు అందించాలని ఆయన కోరారు. సమయానికి రాని అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై త్వరలోనే వైద్యాధికారులతో మాట్లాడుతానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నేతలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి : కార్పొరేటర్ పవన్



కార్మికులకు మద్దతు తెలుపుతున్న పవన్‌కుమార్

**హైదరాబాద్, జనవరి 3 ప్రభాతవార్త:** కార్మికుల సమస్య వెంటనే పరిష్కరించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ కార్యాలయం వద్ద స్ట్రీట్ లైట్ సిబ్బంది వేతనాలు చెల్లించాలని కార్యక్రమానికి కార్పొరేటర్ మద్దతు తెలిపారు. అదే విధంగా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈఈ పున్న నాయక్‌ని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ట్రీట్ లైట్ వర్కింగ్ సిబ్బంది నిరసన వ్యక్తం చేస్తుండడంతో కొత్తపేట డివిజన్లో వీధి దీపాలు వెలగడంకపోవడంతో కాలనీలలో దొంగతనాలు, చైన్ స్నాచింగ్ జరుగుతున్నాయని అన్నారు. కాలనీలలో వీధిదీపాలు వెలగకపోవడంతో వందల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని, వెంటనే స్ట్రీట్ లైట్ కార్మికుల సమస్యలను పరిష్కరించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, మోహన్‌రావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లెలగూడ పోచమ్మ ఆలయంలో గర్భ గుడి నిర్మాణ పనులకు శ్రీకారం



పోచమ్మ గర్భగుడి నిర్మాణపు పనులు ప్రారంభించిన దృశ్యం

**సరూర్‌నగర్, జనవరి 3 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో పునర్మిర్మాణం జరుగుతున్న పోచమ్మ అమ్మవారి ఆలయంలో ముఖ్యమైన గర్భగుడి నిర్మాణపు పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. పురాతమైన పోచమ్మ అమ్మవారి దేవాలయాన్ని దాతల సహకారంతో పునర్నిర్మాణ కమిటీ వారు భవ్యమైన ఆలయంగా నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్లాబు నిర్మాణం పూర్తయినందున ఆలయంలో గర్భగుడి నిర్మాణపు పనులను ప్రారంభించారు. ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు కొత్త మధుసూదన్ రెడ్డి, కార్యవర్గంవారి ఆధ్వర్యంలో పనులకు ఆరంభించారు. ఈ సందర్భంగా కమిటీ వారు మాట్లాడుతూ గర్భగుడిలో ప్రతిష్టించనున్న అమ్మవారి విగ్రహంతో పాటు ఆలయంలో ఏర్పాటు చేయనున్న సింహం, బొడ్రాయి, బలిపీఠం, ద్వార శక్తుల విగ్రహాలను తమిళనాడులోని తంజావూర్‌లో ప్రత్యేకంగా తయారు చేయిస్తున్నట్లు వెల్లడించారు.

## ఘనంగా సావిత్రిబాయి జయంతి ఉత్సవాలు



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

**తుర్కయంజాల్, జనవరి 3 ప్రభాతవార్త :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తుర్కయంజాల్ మున్సిపాలిటీలో సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కే.బిక్షమయ్య మాట్లాడుతూ మొదటి భారతీయ మహిళ ఉపాధ్యాయురాలు అని దేశంలో ఉన్న బడుగు బలహీన వర్గాలకు ఆమె ఆశాజ్యోతి ఆ కాలంలోనే మొదటిసారిగా పాఠశాల స్థాపించి బాలికలందరికీ చదువు నేర్పిన గొప్ప వీరవనిత అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈ.గాలయ్య. ఎం కొండల్ రెడ్డి, జి.నరసింహ, టి.నరసింహ, ప్రభావతి, రాధిక, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య, కళ, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం : షేక్ అక్బర్



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను అభినందిస్తున్న షేక్ అక్బర్

**మలక్‌పేట, జనవరి 3 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల సంక్షేమం జరుగుతుందని మలక్‌పేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛారిజ షేక్ అక్బర్ పేర్కొన్నారు. బిసి సంక్షేమ శాఖమంత్రి, హైదరాబాద్ జిల్లా ఇంఛార్జి పొన్నం ప్రభాకర్‌ను ఆయన మర్యాద పూర్వకంగా పుష్పగుచ్ఛాలను అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద,బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందన్నారు. అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.